# టూ-లెట్

**-వాణిశ్రీ**

"రెండురోజులు గెస్ట్‌హౌస్‌లో వుండేటప్పటికి బోర్ కొట్టింది. మీకెక్కడైనా టూలెట్ బోర్డు తగిలితే చెప్పండి" అన్నాడు కొత్తగా జాయిన్ అయిన వెంకట్.

"టూ-లెట్ బోర్డు మా ఇంటికెళ్లే దారిలోనే వుంది. చాలారోజుల్నుంచి కనిపిస్తోంది. ఎవ్వరూ చేరడంలేదు. ఎందుకో ఏమిటో? ఈవెనింగ్ నాతో వస్తే చూపిస్తాను" అన్నాడు క్యాషియర్ శ్రీకాంత్.

ఆఫీస్ అవర్స్ పూర్తయ్యాక ఇద్దరూ బయలుదేరారు. అదొక డాబా ఇల్లు. గేటుకి టూలెట్ బోర్డు పాతబడిపోయివుంది. ఫోన్ నెంబర్ లేదు.

అంటే ఓనర్స్ అందుబాటులోనే వున్నారన్నమాట. డాబామీద రూమ్ కనిపిస్తోంది. "బహుశా అదే అద్దెకు ఇస్తారనుకుంటా" అన్నాడు శ్రీకాంత్.

గేటు చప్పుడు చేస్తూ "ఏమండీ" అని పిలిచాడు శ్రీకాంత్.

కాసేపటికి గేటు తెరుచుకుంది. ఒక ముసలాయన నిలబడి వున్నాడు.

లాల్చీ పైజమాలో చాలా ఆరోగ్యంగా కనిపించాడు.

"రండి" అంటూ దారి తీసాడు.

హాల్లోకి తీసుకువెళ్లి సోఫాలో కూర్చోబెట్టాడు.

"రూమ్ ఎవరికి?" అన్నాడు ఇద్దర్నీ తేరిపార చూస్తూ.

"నాకేనండి" అన్నాడు వెంకట్.

"నీ పేరేంటి బాబూ?"

"వెంకట్"

"ఇంటి పేరు?"

"చింతా"

"ఏ కులం?"

వెంకట్ చెప్పాడు.

"ఎక్కడ పని చేస్తావు?"

"ఆక్సిజన్ కంపెనీలో అకౌంటెంట్‌గా చేరాను."

"సిటీకి కొత్తన్నమాట"

వెంకట్ తల వూపాడు.

"ఏ వూరు మీది?"

"బుడుంపాడు"

"ఏదీ గుంటూరు పక్కన"

"అవును"

"ఏమేవ్... మీ వూరు అబ్బాయి వచ్చాడు" అని గట్టిగా కేక పెట్టాడు ముసలాయన.

ముసలమ్మ ఎర్రగా, ఎత్తుగా ఉంది. ఆమె కూడా చాలా ఆరోగ్యంగా కనిపించింది.

"ఏమిటండీ?" అంటూ చేతులు కొంగుకి తుడుచుకుంటూ వచ్చింది.

"ఇదిగో ఈ అబ్బాయిది మీ బుడుంపాడట" అన్నాడు వెంకట్‌ని చూపిస్తూ.

"నమస్కారమండీ" అన్నాడు వెంకట్ కుర్చీలోంచి లేచి.

శ్రీకాంత్ కూడా నమస్కారం పెట్టాడు.

"ఎవరబ్బాయివి?" అని ఆమె వివరాలు అడిగింది.

వెంకట్ చెప్పాడు.

"నాకు తెలియక అడుగుతాను... మీ వూరి వాళ్లు చాలా విచిత్రమైన మనుషులంటగా?" అన్నాడు ముసలాయన.

ముసలాయన మాటలకు వెంకట్ అర్థం కానట్టు చూసాడు.

"మాది తెనాలిలే. ఒక ఫ్రెండ్... వాడి పేరేంటి? మేకల ప్రసాద్. వాడి పెళ్లికి వెళ్లాను. ఊళ్లో నీళ్ల సౌకర్యంలేదు. గుంటూరు నుంచి సైకిళ్లకి బిందెలు కట్టి తెచ్చుకుంటున్నారు. వాడకానికి ఒక చెరువు ఉంది. గుంటూరుకి అనుకుని ఉంది కదా అని మున్సిపాలిటీవాళ్లు పైప్‌లైన్లు వేసి పంపులు ఏర్పాటు చేస్తే రెండు గ్రూపుల వాళ్లు మాకొద్దు అని వాటిని పగలగొట్టారంట. విచిత్రమైనవాళ్లు కదూ" అని పకపకా నవ్వాడు ముసలాయన.

"చాల్లెండి. ఎప్పుడో నలభై ఏళ్ళనాటి సంగతి ఎప్పుడూ చెప్తుంటారు" అని ముసలమ్మ మందలించింది.

"ఎలా మర్చిపోను? ఆ పెళ్లిలోనే కదా నన్ను చూసి మీవాళ్లు నా వెంటపడి నిన్ను అంటగట్టారు" అన్నాడు ముసలాయన.

"అబ్బో బడాయి..." అంటూ ముసలమ్మ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ లోపలకు వెళ్లింది.

ఈ ముసలాయన రూమ్ గురించి చెప్పకుండా ఏదేదో మాట్లాడుతున్నాడని శ్రీకాంత్‌కి చిరాకు కలిగింది.

వెంకట్ అయోమయంగా చూస్తున్నాడు. ముసలమ్మ రెండు కప్పుల్లో కాఫీ తెచ్చి టీపాయ్ మీద పెట్టింది.

"తీసుకోండి" అన్నాడు ముసలాయన చిరునవ్వుతో.

"మీరు?" అన్నాడు వెంకట్ మొహమాటపడుతూ.

"ఆయనకి చాలాసార్లయింది. మీరు మొహమాట పడకుండా తీసుకోండి నాయనా'' అన్నది ముసలమ్మ.

ఇద్దరూ కాఫీ తాగుతున్నంతసేపూ ముసలాయన తన అత్తగారి వూరివాళ్లని మూర్ఖులనీ, పొగరుబోతులనీ, అజ్ఞానులనీ ఆడిపోసుకుంటూనే వున్నాడు.


"రూమ్ చూపిస్తే...'' అని వెంకట్ నసిగాడు.

"ఆ...అలాగే... ఏమోయ్ ఆ రూమ్ తాళం ఇవ్వు'' అని కేక పెట్టాడు.

ముసలమ్మ తాళం చెవి తెచ్చి ఇచ్చింది. వెంకట్, శ్రీకాంత్ ఇద్దరూ డాబా పైకి వెళ్లారు. గది తెరిచి చూసారు.

రూమ్ బాగానే ఉంది. అటాచ్డ్ బాత్రూమ్. పైన నీళ్లట్యాంకు కూడా ఉంది. అన్ని సౌకర్యాలు





ఉన్నాయి.

"బాగానే వుంది" అని వెంకట్ తన సంతృప్తిని వ్యక్తం చేసాడు.

"ఇంకేం? అడ్వాన్సు ఇచ్చి మంచిరోజు చూసుకుని చేరిపోతే పోలా?" అన్నాడు శ్రీకాంత్.

తల వూపాడు వెంకట్.


ఇద్దరూ క్రిందకు దిగి వచ్చారు.

"రూమ్ నాకు నచ్చిందండీ" అన్నాడు వెంకట్.



## ముందు చూపు!

యాడ్స్‌లో నటిస్తూ , షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవాలలో రిబ్బన్ కటింగ్ చేస్తూ మన హీరోయిన్లు సినిమాల్లోకన్నా ఎక్కువ డబ్బు సంపాదిస్తున్నారు. స్నేహ, శ్రియ, అనుష్క... మార్గంలోనే ఇప్పుడు తమన్నా పయనిస్తోంది. షూటింగ్ లేని సమయంలో ఇలా యాడ్స్‌లో, షాపింగ్ ప్రారంభోత్సవాలలో బిజీబిజీగా ఉంటూ రోజుకు దాదాపుగా పది నుంచి ఇరవై లక్షల దాకా సంపాదిస్తోందని సినీజనాలు చెప్పుకుంటున్నారు. ఏదేమైనా హీరోయిన్‌గా డిమాండ్ ఉన్నప్పుడే డబ్బు సంపాదించాలన్న వారి ఆలోచనకు హేట్సాఫ్ చెప్పాల్సిందే మరి!




"అద్దె ఎంతో చెప్తే" అన్నాడు శ్రీకాంత్.

"అద్దె ప్రాబ్లమ్ కాదు. మావి కొన్ని కండిషన్స్ ఉన్నాయి" అన్నాడు ముసలాయన.

'ఏముంటాయి? ఫ్రెండ్స్ ఎక్కువగా రాకూడదు. రూమ్‌లో పేకాటలు, మందు పార్టీలు అంటూ గొడవ చేయకూడదు అంతేగా?' అనుకున్నాడు వెంకట్.

"నీకింకా పెళ్లి కాలేదుగా?" అని అడిగాడు ముసలాయన.

లేదని తల వూపాడు వెంకట్.

"బాగా తీరికేనన్నమాట"

నవ్వాడు వెంకట్.

"స్కూటర్ ఉందా?"

"ఆ...ఉందండీ. కొత్త బైక్"

"వెరీగుడ్"

"ఆఫీసుకు ఎన్నిగంటలకు బయల్దేరుతావు?"

"తొమ్మిదిన్నరకి బయల్దేరితే చాలండి. పావుగంటలో చేరిపోతాను. ఆఫీసు దగ్గరే" అన్నాడు వెంకట్.

"మీరేదో కండిషన్లు అన్నారు" గుర్తు చేసాడు శ్రీకాంత్.

"అదే చెప్పబోతున్నా. పొద్దునే లేచి మా కుక్కపిల్లని మార్నింగ్ వాక్‌కి తీసుకువెళ్లాలి"

"ప్రొద్దున్నేనా?"

"అవును. మార్నింగ్ నేను బిజీగా ఉంటాను. ఈవెనింగ్ నేనే తీసుకువెళ్తాను"

వెంకట్ వెంటనే శ్రీకాంత్‌వైపు చూసాడు. తనకి పొద్దునే లేచే అలవాటు లేదు. ఏనిమిదింటికి లేస్తే గొప్ప.

"ఇక ఎనిమిదింటికి మా మనవళ్లు ఇద్దర్నీ బైక్‌మీద ఎక్కించుకుని స్కూలు దగ్గర దిగబెట్టాలి"

వెంకట్ ముఖం కళ తప్పింది.

"సండే...సండే నన్ను రైతు బజారుకు తీసుకువెళ్లాలి. భీమవరం నుంచి రొయ్యలు, పీతలు వస్తాయి. అవంటే నాకు భలే ఇష్టం" చెప్పాడు ముసలాయన.

టూ-లెట్ బోర్డు చాలాకాలం నుంచి అలాగే ఎందుకుందో శ్రీకాంత్‌కి అర్థమయింది.

"మళ్లీ వస్తాం తాతగారు" అంటూ లేచాడు వెంకట్.

శ్రీకాంత్ వెంకట్‌ని అనుసరించాడు.

"ఆ ముసలాడి కండిషన్లు నాకేం నచ్చలేదు. నావల్లకాదు" అన్నాడు వెంకట్.

శ్రీకాంత్ నవ్వి వూరుకున్నాడు.

ఇంటి యజమానులు ఇటువంటి కండిషన్లు కూడా పెడతారని మొదటిసారి తెలుసుకున్నాడు.

***

"ష్...ష్..! ఈ కుర్రాడు మళ్లీ వస్తాడని నాకు నమ్మకంలేదు" అని నిట్టూరుస్తూ ముసలాయన ఎదురుగా కూలబడింది ముసలమ్మ.

"వీడు కాకపోతే ఇంకొకడు వస్తాడు. రోజుకి ఒకడొచ్చినా మనకి మంచి కాలక్షేపం" అని నవ్వాడు ముసలాయన.

★